Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

ప్రజాశక్తి

Vol. 5, no. 25

(Dec. 20, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 25

(Dec. 20, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 5 బుధవారం 20-12-44 సంచిక 25

★ మనరాజకీయాలు

ఆంధ్రదేశభక్తుల కర్తవ్యం

దేశంలోని ప్రజలందరిమధ్య ఐకమత్యం నిర్మించాలి. ప్రధాన రాజకీయ సంస్థలైన కాంగ్రెసు, లీగు, ఐక్యతయే జాతీయైక్యతకు పునాది. ఐకమత్యం ద్వారానే భారతీయులం బ్రిటిషు సామ్రాజ్యవాదులనుండి జాతీయప్రభుత్వం గుంజుకోగల్గుతాము. అందుకొరకు, నేడు ప్రజలను ఎదుర్కొంటున్న కరువుకాటకాలు, అంటువ్యాధులను నివారించడానికి అన్ని పార్టీలు కలసి కృషిచేయాలి. అపుడే మనప్రజలను రక్షించుకోగల్గుతాము. అని కమ్యూనిస్టులం గత రెండు సంవత్సరాలనుంచి దేశభక్తులకు విన్నవించుతున్నాము.

ఈ వాస్తవిక విషయాలను గుర్తించిన కాంగ్రెసు సోదరులు రాయలసీమ కరువునివారణకు కమ్యూనిస్టులతో కలసి పనిచేశారు. ఇపుడు విశాఖజిల్లాలో కె. యస్. గుప్త, దిగుమర్తి రామస్వామిగార్లవంటి కాంగ్రెసునాయకులు కరువు నివారణసంఘంలో చేరి, కమ్యూనిస్టులతో కలసి ప్రజాసేవ చేస్తున్నారు. నేడు ఆంధ్రప్రజానీకాన్ని, కరువు, అంటువ్యాధులనుండి రక్షించదలచిన కాంగ్రెసు దేశభక్తులందరి కర్తవ్యం కూడా యిదే.

కాని దురదృష్టవశాత్తు, ఆంధ్ర కాంగ్రెసువాదులపై తమంతట తామే పెత్తనం పెట్టుకున్న అయ్యదేవర కాళేశ్వరరావు లాంటివారు కరువు-కాటకాలనుండి ప్రజలను రక్షించాలసిన కర్తవ్యాన్ని మరచిపోయారు. కమ్యూనిస్టులపైగల వారికోపం ప్రజలయెడవారికున్న బాధ్యతనే మరచిపోయేలా చేసింది. ఏ విషయంలో కూడ కమ్యూనిస్టులతో కలసి పనిచేయరాదని వీరు కాంగ్రెసువాదులకు హుకుం జారీచేశారు. ప్రజల ఆహారకమిటీలలో సభ్యులుగాచేరి, కమ్యూనిస్టులతో కలసి పనిచేస్తున్నందుకు కాంగ్రెసువాదులను బెదరించారు. తాము గాంధీజీ హుకుం సంపాదించామనే పేరుతో నేతి చలపతిగారి వంటి కాంగ్రెసునాయకులను ఆహారకమిటీనుంచి రాజీనామాయిచ్చునట్లు వత్తిడిచేశారు. ఇందుకు వారొక విచిత్రవాదన తెచ్చేవారు. "కమ్యూనిస్టులు ప్రభుత్వంతో సహకారంచేస్తున్నారు. మాపాలసీ నాన్‌కోపరేషను. ఆహార కమిటీలలోచేరితే ప్రభుత్వంతో కోపరేట్‌చేయవలసివస్తుంది. అందుచే కూడదని" వాదించేవారు.

అనర్థదాయకమైన యీ పాలసీని ఆంధ్ర కాంగ్రెసువాదులపై కాళేశ్వరరావుగారు రుద్దుటవల్లనే ఆంధ్రదేశంలో నిస్పృహ, నిరాశ వ్యాపించాయి. కాంగ్రెసువాదులు చాలమంది చేతులు ముడుచుకొని కూర్చున్నారు. విశాఖకరువు వంటి ప్రజా యిబ్బందులను తొలగించడానికి కాంగ్రెసు దేశభక్తులంతా కలసి తగినంత కృషి చేయలేకపోయారు. అయినప్పటికి కొందరు కాంగ్రెసు దేశభక్తులు కాళేశ్వరరావుగారి బెదిరింపులకు జంకకుండా, ఐక్య ఆహారకమిటీలలోను, కరువునివారణ కమిటీలలోను కలసి పనిచేస్తున్నారు. ప్రజాసేవచేస్తూ తక్కిన కాంగ్రెసుసోదరులకు మార్గం చూపుతున్నారు.

శుభసూచకం

ఎట్టకేలకు కాళేశ్వరరావుగారుకూడ తమధోరణి మార్చుకోవలసి వచ్చింది. కృష్ణాజిల్లా ఆహారమహాసభకు సందేశం పంపారు. 'బ్లాకుమార్కెట్టును అనగా దొంగవ్యాపారాన్ని అణచడం విషయంలో ఎవరు ప్రయత్నించినా నాకు సానుభూతి కలదు' అని వ్రాశారు. దొంగమార్కెట్టును అణచడానికి కమ్యూనిస్టులు ప్రయత్నించితే అది ప్రభుత్వంతో సహకారమని పూర్వం ఆక్షేపించినవారే నేడు వాస్తవిక స్థితిని క్రమంగా గుర్తించడం శుభసూచకం.

"అవకాశమున్నచో సాయంచేయడానికి, అన్యాయం జరుగకుండా చూడటానికీ కాంగ్రెసువాదులు ప్రభుత్వంచే నియమింపబడ్డ ఆహార కౌన్సిళ్ళలో (quasi official organisations) చేరి పనిచేయవచ్చునా?" అనే ప్రశ్నకు గాంధీజీ చేరి పనిచేయవలసిందేనని స్పష్టంగా జవాబిచ్చారు. (15 వ తేదీ 'హిందూ' పత్రికలో ప్రకటించబడింది) కమ్యూనిస్టు వ్యతిరేకతే తమ ఆశయంగా పెట్టుకున్నవారి దృక్పథం గాంధీజీ సలహా తరువాతనైనా మారుతుందని ఆశించుతాము. జైలునుండి బయటకు వచ్చినప్పటినుండి కమ్యూనిస్టులపై నిందలే వృత్తిగా పెట్టుకున్న రంగాగారు పైవార్తను పత్రికలకు యివ్వడం గమనించవలసిన విషయం. దీనితోపాటు రంగాగారు గవర్నరు సలహాదారులవద్దకు రాయబారం వెళ్లారనికూడా వార్తలు వచ్చాయి.

అనగా, ఆహారకమిటీలలో పనిచేయడమంటే ప్రజల యిబ్బందులను తొలగించడానికి కృషిచేయడమేగాని, కోపరేషన్ - నాన్‌కోపరేషన్ అనే మీమాంస యిందులో లేనేలేదు. మన ప్రజలను రక్షించుకోవడం మన కర్తవ్యం అనే సత్యాన్ని కాంగ్రెసువాదులు క్రమంగా గ్రహించుతున్నారు.

ముందు కర్తవ్యం

కాంగ్రెసు సోదరులు యింకో అడుగు ముందంజవేయాలి. ఇంతవరకు కాళేశ్వరరావుగారు కాంగ్రెసు అసెంబ్లీలలో కమ్యూనిస్టులను చేర్చుకోరాదని నిషేధం పెట్టారు. కర్నూలు కాంగ్రెసువాదులకు సమాధానంగా ప్యారీలాల్ కాంగ్రెసులో కమ్యూనిస్టులు చేరడానికి అభ్యంతరంలేదని వ్రాశారు. ఈ విషయం గుటకదిగక, కాళేశ్వరరావుగారు కాంగ్రెసు సభ్యులనే చేర్పించనక్కరలేదని ప్రకటన చేశారు. దీనినే 'చెరువుమీద అలిగి స్నానం మానివేయడ'మంటారు. ప్రజలలో రాజకీయ చైతన్యం కలిగించి కాంగ్రెసును బ్రహ్మాండమైన సంస్థగా నిర్మించవలసిన రోజులలో కమ్యూనిస్టులు చేరుతారనే భయంతో సభ్యులను చేర్పించడమే మానుకోడం సబబుకాదు. జనవరి 6 వ తేదీన ఆంధ్ర కాంగ్రెసునాయకులు నెల్లూరులో సమావేశం కాబోతున్నారు. కాళేశ్వరరావు, రంగా ప్రభృతులు అనుసరించుతున్న అనర్థదాయకమైన కమ్యూనిస్టు వ్యతిరేక పాలసీని మార్చుకుంటారని ఆశించుతాము. స్వాతంత్ర్యం, ప్రజాసేవ ఆశయం గల వారందరికి ఆంధ్ర కాంగ్రెసులో స్థానమివ్వాలని కోరుతాము. సభ్యులనుచేర్చి ఆంధ్రదేశంలో కాంగ్రెసును విశాలమైన జాతీయసంస్థగా నిర్మించుతారని విశ్వసించుతాము.

ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మార్పు తీసుకొనివచ్చుటకు వివిధజిల్లానాయకులు పూనుకుంటారని, ఐక్యమార్గాన్ని సోదర కాంగ్రెసు దేశభక్తులందరకూ చూపి, తిరిగి రాజకీయ జీవితాన్ని పునరుద్ధరించుటకు, ప్రజాసమస్యలను తీసుకొని పనిచేయుటకు, ఐక్య ప్రజాఉద్యమాన్ని నిర్మించుటకు ముందుకు వస్తారని ఆశిస్తున్నాము.

★ సంపాదకీయం

స్వాగతం

జైళ్ళనుంచి విడుదలై వచ్చిన ఆంధ్రజిల్లాల కాంగ్రెసు నాయకులందరికి మా హృదయపూర్వక స్వాగతం. మిగిలిన రాష్ట్ర కాంగ్రెసునాయకులు, జిల్లా నాయకులు గూడా త్వరలోనే ఆంధ్ర ప్రజలమధ్యకు రాగలరని విశ్వసిస్తున్నాము.

దారితెన్ను తెలియక అనేక ఆర్థికబాధలకు గురి అవుతున్న ఆంధ్ర ప్రజానీకానికి ప్రజాసేవకులెందరైనావారే కావాలి. కరువుకాటకాలకు, అంటువ్యాధులకు గురియై నిరాశ నిస్పృహలలో చిక్కిన ఆంధ్ర ప్రజలందరిని ఉత్తేజపరిచే ఐక్య రాజకీయజీవితాన్ని రాష్ట్రంలో తిరిగి పునరుద్ధరించుతారనే ఆశతో విడుదలైన నాయకులందరిని సంతోషపూర్వకంగా ఆంధ్ర ప్రజలు ఆహ్వానిస్తున్నారు.

దొంగమార్కెట్లు, అక్రమలాభాలు మొదలైన అత్యాచారములక్రింద నలిగిపోతున్న పట్టణాల్లో, పల్లెలలో, ముఖ్యంగా కరువుప్రాంతాల్లో నానాటికి దుర్భర జీవితాలను గడుపవలసివస్తున్న ఆంధ్ర ప్రజాసామాన్యం దేశభక్తులనుండి ఆశించేదేమిటి? కరువు కాటకాలు బయలుదేరుటవల్ల ఆకలిబాధకు, అంటువ్యాధులకు గురియై చచ్చిపోతున్న ఉత్తర విశాఖజిల్లా ప్రజలు ప్రజా నాయకులనుంచి కోరేదేమిటి?

ఈ పరిస్థితుల్లో దేశవ్యాపితంగా ప్రబలిపోయిన అత్యాచారాలను సహించలేక ఆవేదనతో బాధపడుతున్న దేశనాయకుడు గాంధీజీ కాంగ్రెసువాదులకిచ్చిన సలహా ఆశాజనకంగా వుంది. ప్రజా క్షేమానికి భంగం కల్గించకుండా చూచుటకు, వీలైతే ప్రజలకు ప్రయోజనం కల్గజేయుటకు కాంగ్రెసువాదులు ఆహార కౌన్సిళ్ళలో పనిచేయాలని హెచ్చరించాడు.

ఆంధ్రలోనే పూర్వపు వైఖరిని మార్చుకుని, శ్రీ అ. కాళేశ్వరరావుగారు కృష్ణాజిల్లా ఆహార సమావేశానికి పంపిన సందేశం శుభసూచకంగా ఉంది. "దొంగవ్యాపారాన్ని అణచడంలో ఎవరు ప్రయత్నించినా నాకు సానుభూతి కలదు." అని చెప్తూ బాగాపండే ప్రాంతాల్లోగూడా బయలుదేరుతున్న క్షామబాధను గుర్తించి "రైతులు పండించే ధాన్యం ధరల విషయంలోనూ, వారినుండి ధాన్యం సేకరించే విషయంలోనూ రైతుసంఘాల అభిప్రాయాన్ని గమనించవలెన"ని చెప్పారు.

ఐక్యప్రజాకృషియే ప్రజాసమస్యలకు పరిష్కారమార్గమని పైరెండు ప్రకటనలు ఉద్బోధిస్తున్నాయి. నిర్మాణకార్యక్రమంద్వారా జాతీయజీవనాన్ని పునరుద్ధరించాలనే ఆశయంతో, కాంగ్రెసు అసెంబ్లీలు ఏర్పాటు చేయబడుతున్న సమయంలో, పైన పేర్కొనబడిన ప్రకటనలు రెండూ ఉత్సాహకరంగా ఉన్నాయి.

రాజకీయ దృక్పథాల్లో భేదాలున్నప్పటికి, నిర్మాణ కార్యక్రమంలో, కలసిపనిచేయుటకు ముందుకువచ్చే దేశభక్తులందరికి స్థానం ఉందని వేరుగా చెప్పనక్కరలేదు. ఆంధ్రలోని దేశభక్తులందరూ-కమ్యూనిస్టులు-కాంగ్రెసువాదులు-కలసిపనిచేయుటకు పూనుకున్నప్పుడే నిర్మాణకార్యక్రమం పూర్తిగా జయప్రదం కాగలదు. ప్రజలకు ఉపకరించి ఉత్తేజపరచగలదు. ఐక్య ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలంటే ప్రజాసేవకై ముందుకు వచ్చే దేశభక్తులందరి ఐక్యత అత్యావశ్యకమైయున్నది. ఇట్టి పరిస్థితులలో నిర్మాణ కార్యక్రమం అమలు జరుపవలసిన కాంగ్రెసు అసెంబ్లీలలో కమ్యూనిస్టు ప్రజాసేవకులకు స్థానంలేకుండా చేయాలనే దృక్పథం సరియైనది కాదని వెంటనే స్పష్టపడుతుంది.

నిస్తబ్ధత, నిస్పృహలతో కూడియున్న

Microfilmed from photocopy

Roja Muthiah Research Library
3rd Cross Road, C P T Campus,
Taramani, Chennai - 600 113, India.

రాయిస్టుల విచ్ఛిన్న ప్రయత్నాలు విఫల మయ్యాయి

యం. యస్. యం. రైల్వేకార్మిక మహాసభ

రైల్వేకార్మికుడుగా 25 యేండ్లు పనిచేశారు. కాంగ్రెస్ ఎం. ఎల్. ఏ., కార్మికోద్యమంలో జుట్టునెరసినతాత వి. వి. నరసింహంగారు మద్రాసులో కూరగాయల కరువుందని తెలుసుకున్నారు. మహాసభకు తమతోపాటు కూరలను తీసుకుపోవాలన్నారు. రాజమండ్రి చుట్టుప్రక్కల వున్న రైతులను సాయం చేయమని కోరారు. వెంటనే దొర్లుకుంటూ వచ్చాయి కూరగాయలు: కొబ్బరికాయల బస్తాలు, పచ్చిఅరటిగెలలు, అరటాకుల కట్టలు, గుమ్మడికాయలు వగైరా. మద్రాసు కామ్రేడ్సు అచటి ఖరీదులనుబట్టి యివి 400 రూపాయలు విలువచేస్తాయన్నారు. నిజంగా యివి రైతుసోదరులు తమకార్మికసోదరుల మహాసభకు ప్రీతిపూర్వకంగా యిచ్చిన కానుకలు; వెలలేని కానుకలు.

రాజమండ్రిలో 7 వ తేదీరాత్రి 12 గంటలకు రైలులో ప్రతినిధులుబయలుదేరారు. బెజవాడలోను, చిట్టగుంటలోను మరికొంతమంది ఎక్కారు. ఆపెట్టెపై కార్మికజెండా ఎగురుతూంది. "కరువుభత్యం కావాలి. కాంగ్రెసు నాయకులను విడుదల చెయ్యాలి. కాంగ్రెసు లీగు ఐక్యత ఏర్పరచాలి" అనే నినాదాలతో రైలుబండి మార్మోగింది. దోవపొడుగునా గ్యాంగుకూలీలు మందహాసాలతో తమ ప్రతినిధులను ఆశీర్వదించారు. 8 వ తేదీ రాత్రి 10 గంటలకు మద్రాసు చేరింది. ఇతర బ్రాంచీలనుంచికూడ తెల్లవారేటప్పటికి ప్రతినిధులొచ్చారు. మొత్తం 200 ప్రతినిధులు హాజరయ్యారు. వీరుగాక వివిధ బ్రాంచీల నుంచి 300 ప్రేక్షకు లొచ్చారు.

ఎం. ఎస్. యం. రైల్వే 8 వేల మైళ్ళు పొడుగుంది. 60 వేల మందికి పైగా కార్మికులున్నారు. 20,000 మంది యూనియన్ సభ్యులుగా చేరారు. ఇది రాష్ట్రములోవున్న గొప్ప కార్మికసంఘాలలో ఒకటి. ఈ రైల్వే కలిమి - లేములున్న ప్రాంతాలలో నుంచి పోతూంది. ఆహారవంటలు సమృద్ధిగాపండే కృష్ణా-గోదావరి డెల్టాలనుంచి కరువుప్రాంతాలైన విశాఖ, రాయలసీమజిల్లాలకు అందచేస్తున్నారు ఈ రైల్వేకార్మికులు. ఈ కార్మికవీరులు మద్రాసు, విశాఖ, కాకినాడలపై బాంబులు పడినపుడు తమస్థానాలలో నిలబడి రవాణా కొనసాగించారు. జపాను దుండగీడులను తరుమడంలో తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు.

ఈ సంవత్సరం సభకు ప్రత్యేక ప్రాముఖ్యత వుంది. దేశద్రోహులైన రాయిస్టులు యూనియన్‌ను చీల్చడానికి ప్రయత్నించుతున్నారు. వారి ప్రయత్నాలను అరికట్టాలి. కార్మికుల యిబ్బందులు. కరువు భత్యాలు విషయం చర్చించి. నిర్ణయించవలసివుంది.

సభా ప్రారంభం

8 వ తేదీ సాయంత్రం సభ ప్రారంభమయింది. దాదాపు 2 వేలమంది హాజరైనారు. ఒకవందమంది స్త్రీలుకూడ వచ్చారు. మహాత్ముని విగ్రహాన్ని పుష్పమాలంకృతులనుచేసి, ఎలెక్ట్రిక్ లైటులతో మరింత దేదీప్యమానంగా ప్రకాశించేటట్లు చేశారు. యస్. ఐ. రైల్వే యూనియన్‌నుంచి 300 మంది వూరేగింపుతో మహాసభకు హాజరయ్యారు. కామ్రేడ్ పురుషోత్తం యస్. ఐ. ఆర్. యూనియన్ అధ్యక్షులు జండా యెగరవేశారు. రైల్వేపనివారలు చాకచక్యముతో సైన్యను నడిపి దేశాన్ని రక్షించవలసిన బాధ్యతనుగూర్చి వుద్బోధించారు. కామ్రేడ్ సుందరయ్య, భారత కమ్యూనిస్టు నాయకులు, ఆంధ్రకిసాన్ సభతరపున సౌహార్ద్రప్రతినిధిగా మహాసభను అభినందించి ప్రతినిధులను, ప్రేక్షకులనుకూడ వుత్తేజపరచారు. రైల్వే కార్మికులు దేశానికి వెన్నెముకవంటివారని, 1932 లో జరిగిన యీ రైల్వే కార్మికుల సమ్మె రైతువుద్యమాన్నికూడ ముందుకు తీసుకునివచ్చిందని, రైతు-కూలీ వుద్యమాలు జాతీయోద్యమాన్ని బలపరచుతూ వుంటాయని తెలియపరచారు.

కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలి

కామ్రేడ్ గురుస్వామి తన అధ్యక్షోపన్యాసంలో యూనియన్ యెలా బలపడుతూ వచ్చిందీ వివరీకరించారు. గుంతకల్ తీర్మానాలను, ముఖ్యంగా ట్రాన్సుపోర్టుతీర్మానాన్ని, యూనియన్ యెలా ఆచరణలో పెట్టిందీ తెలియచేశారు. దీనివిషయమై బెజవాడ, రాజమండ్రి, గుంతకల్, పెరంబూరు బ్రాంచీలు చేసినకృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. నేషనల్ గవర్నమెంటు ఆవశ్యకతను గూర్చి మాట్లాడుతూ, కాంగ్రెసునాయకులను విడుదలచెయ్యాలని లీగు-కాంగ్రెసు ఐక్యత చేకూరాలని కోరారు.

ఆ రాత్రి పెరంబూరు బ్రాంచి వైజ్ఞానిక దళంవారు తమిళనాటకం వేశారు. సుమారు వెయ్యిమంది హాజరైనారు.

రాయిస్టుల ఆటంకాలు

10 వ తేదీ ఉదయం సెంట్రల్ యెక్సిక్యుటివ్ కౌన్సిలు సమావేశమయింది. దీనిలోని రాజకీయ గ్రూపులనుగూర్చి క్లుప్తంగా తెలియచేస్తాను. మొత్తంమీద ఈక్రింది గ్రూపులన్నీ యూనియన్‌లో వున్నాయి. కాంగ్రెసుఅభిమానులు, కమ్యూనిస్టులు, రాయిస్టులు-తటస్థులు. రాయిస్టులు తప్ప మిగిలినవారంతా కలిసి పనిచేస్తున్నారు. నేషనల్ గవర్నమెంటు, కాంగ్రెసు నాయకుల విడుదల, లీగు - కాంగ్రెసు ఐక్యత కావాలని కోరుతున్నారు. ట్రేడ్‌యూనియన్‌కాంగ్రెస్‌లోనే యూనియన్ ఒక శాఖగా వుండాలంటున్నారు. ప్రజాసమీకరణ, కార్మికుల నిర్మాణయుక్తమైన ఐక్యతతో తమ కష్టాలను నెరవేర్చుకోవాలని వీరిపాలసీ. రాయిస్టులు పూర్తిగా వీటికి వ్యతిరేకంగా వున్నారు. సి. యి. సి. ప్రారంభంలోనే వీరి విచ్ఛిన్న పోకడ బయటపడ్డది. ప్రతినిధుల అందరియొక్క యెన్నికలనుగూర్చి వివరాలియ్యాలన్నారు రాయిస్టు కృష్ణమూర్తిగారు. అంటే, మహాసభ కాలమంతా యీసరిపోతే సరి. అందువలన మిగిలిన సభ్యులందరూ యీయెత్తు కనిపెట్టి అందరూసరిగా యెన్నుకోబడినవారేనే అని అంగీకరించారు. కృష్ణమూర్తిగారి సభ్యత్వం సరిగా లేదని చాలామంది భావించినప్పటికి, యీ టెక్నికల్ విషయాలపై చీలికలు కలుగచేసే అవకాశాలు లేకుండా చేశారు. ప్రతినిధుల సమావేశంలో కార్మికుల కష్టాలపైన తీర్మానాలను తయారుచేయుటకు ఒక కమిటీని వేశారు.

— మా విలేఖరి

కార్యదర్శి నివేదిక

ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె. యల్. నరసింహంగారు తన నివేదికను ఇలా చదవ ప్రారంభించారు:-

షెడ్డుల్లో నాగాలు తగ్గించగల్గాము. పనులు శ్రద్ధగాను నైపుణ్యముతోను, ఎక్కువచురుకుగాను నెరవేర్చగల్గాం. ఇంజనులు బాగుచేయుటకు గుంతకల్ బ్రాంచి అధికారులకు కొన్ని సూచనలు చేసింది. అని యీవిధంగా రైల్వేకార్మికులు నెరవేర్చిన పనులనుగూర్చి చదువుతుంటే ప్రతినిధులు సగర్వంగా చూడటం ప్రారంభించారు.

యూనియన్ సభ్యత్వం 20 వేల వరకు పెరిగింది. 12 బ్రాంచీలు. డిపార్టుమెంటల్ కమిటీలు, స్టేషన్ కమిటీలు, సెక్షనల్ కమిటీలు యేర్పడి పనిచేస్తున్నాయి. కార్మికుల కష్టాలను అధికారులకు తెలియజేయుచూ రికగ్నిషనును వినియోగించుకొని, కార్మికుల కష్టాలను తీర్చుచూ, యూనియన్‌ను పెంపుచేసుకో గలిగామని తెలియజేశారు. మదరాసులో వరదలవల్ల నష్టపడినవారికి సహాయపడ్డామని, కట్టెల కరువు యేర్పడినప్పుడు రేషనింగు యేర్పరచాలని పెరంబూరుబ్రాంచివారు కోరారని తెలియపరచారు.

కరువుభత్యం - కనీసపుజీతాలు

కార్యదర్శి నివేదిక తరువాత తీర్మానాలు చర్చించబడ్డాయి. మొదటితీర్మానం సారాంశం- రైల్వేమెన్సు ఫెడరేషన్ కోరిన కరువుభత్యం రైల్వేబోర్డు, యివ్వాలని. అలా యివ్వకపోతే ఎంక్వైరి కమిటీగాని, కన్సిలియేషన్ బోర్డునుగాని నియమించాలని కోరబడింది. ప్రభుత్వం అలా నియమించకపోతే, ప్రజలమధ్య తీవ్రమైన ప్రచారం చెయ్యాలని కోరబడింది.

దీనికి కృష్ణమూర్తిగారు ఒక తీర్మానాన్నే సవరణగా తెచ్చారు. దానిప్రకారం కార్మికుల కనీసపుజీతాలు నిర్ణయించేందుకు ఒక ప్రతినిధి కార్మికసంఘం నుండి, యజమానుల ప్రతినిధి ఒకరు, ఒక హైకోర్టు జడ్జి, ఆహారశాస్త్రనిపుణుడు (Nuitrition expert) యింకా కొంతమందితో కూడిన కమిటీ కోరబడింది. ఇది సవరణగా అంగీకరించితే ఇప్పుడు రైల్వే పనివారలు ఆందోళనచేస్తున్న కనీసపు జీతాల విషయం వెనుకబడుతుంది. అందువల్ల దీనిని ప్రత్యేక తీర్మానంగా పెట్టాల్సిందని అధ్యక్షుడు కోరారు. వారి సూచన అంగీకరించబడింది.

కృష్ణమూర్తిగారి సవరణ ప్రత్యేక తీర్మానంగా అంగీకరించబడింది. దానిని రైల్వేపనివారల ఫెడరేషను విచారించవలసినదిగా కోరబడింది. కాని యీ తీర్మానం పనివారల కనీసపు జీతాల సిద్ధాంతాన్ని యితరులకు వదిలివేయబడింది. ఇది పనివారలకు యెంతవరకు వుపయోగపడేది అనుమానాస్పదం.

తరువాత పనివారల కష్టాలపై తీర్మానాలు తీసుకున్నారు, డిపార్టుమెంటల్‌గా కష్టాలన్నిటిని క్రోడీకరించిన తీర్మానాలు ఆమోదింపబడినాయి. ఆ రోజు సమావేశం ముగిసింది.

రాత్రి చిట్టగుంట వైజ్ఞానికదళంవారు, రాజమండ్రి కామ్రేడ్సు, వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిపారు. సుమారు 1000 మంది హాజరై, తెనుగుభాష అయినప్పటికి, కదలక కూర్చున్నారు. అఖిలభారత ట్రేడుయూనియన్ కాంగ్రెసు మహాసభకు రు. 12-4-8 వసూలు చేయబడింది.

రాజకీయ తీర్మానం

ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సమావేశం ప్రారంభమయింది. గత రాత్రి అనుభవాన్ని తీసుకుని ప్రేక్షకులను యెవ్వరిని లోనికి రానియ్యలేదు. సుమారు 40 మంది వాలంటీర్లు ఇందుకు వినియోగించబడ్డారు. వివాదగ్రస్తమైన తీర్మానాలు చర్చకువచ్చాయి.

రాజకీయ తీర్మానంలో ప్రతిష్టంభన కొనసాగించుతున్నందుకు ప్రభుత్వపుచర్యను నిరసించుతూ, కాంగ్రెసునాయకులను బేషరతుగా విడుదలచెయ్యాలని, కాంగ్రెస్ - లీగ్ ఐక్యతి స్థాపించి, జాతీయప్రభుత్వం యేర్పరచాలని కోరబడింది.

కృష్ణమూర్తి తన రంగు బయటపెట్టారు. కొన్ని సవరణలను తెచ్చారు. అవి ప్రతినిధులు అంగీకరించలేదు. తీర్మానాన్నే వ్యతిరేకించారు. కాంగ్రెస్ - లీగులు పాసిస్టు సంఘాలన్నారు. ఈయన వుపన్యాసాన్ని సహించలేక ప్రతినిధులు హీహూలు ప్రారంభించారు అందరి మొగాలు కందగడ్డలైపోయాయి. శ్రీనివాసుల నాయుడుగారు (పెరంబూరుబ్రాంచివుపాధ్యక్షులు కాంగ్రెస్.) తీర్మానాన్ని బలపరచుతూ కాంగ్రెస్ నాయకుల విడుదల లీగ్ - కాంగ్రెస్ ఐక్యతకు యెలా దారితీస్తుందో తెలియపరచారు. సరే ఓటింగు పెట్టారు. తీర్మానానికి వ్యతిరేకంగా 40 ఓట్లుమాత్రమేవచ్చాయి. 'కాంగ్రెసునాయకులువిడుదలకావాలి' అని నినాదాలు మిన్నుముట్టాయి. రాయిస్టు కృష్ణమూర్తి ముఖం వెల్లబడింది.

కృష్ణమూర్తి బెదిరింపు

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ మీద తీర్మానం కామ్రేడ్ గోపాల్ (బెజవాడ) ప్రవేశపెట్టారు. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ భారత కార్మికుల కేంద్రసంస్థ అని, దాని కృషిని అభినందించారు. తరువాత ఇండియన్ లేబరు ఫెడరేషన్ (రాయిస్టులసంస్థ) పాలసీ జాతీయ విద్రోహకరముగను, కార్మిక వర్గానికి వ్యతిరేకంగాను వున్నదని స్పష్టపరచారు. ఎం. ఎస్. ఎం. రైల్వే యూనియన్ తరపున, అధికారరీత్యా యే యితరసంస్థలలోను యూనియన్ పర్మిషన్‌లేకుండా ప్రాతినిధ్యం వహించగూడదని తీర్మానం.

దానిమీద కామ్రేడ్ గోపాల్ మాట్లాడుతూ యీ రోజున ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్మికుల ఏకైక సంస్థగా యెలా అభివృద్ధి చెందుతూ వచ్చిందీ తెలియచేశారు. రాయిస్టుల పాలసీవల్ల పోటీసంస్థలు కార్మికులను యెలా బలహీనపరచుచున్నదీ వెల్లడిచేశారు.

ఈ తీర్మానాన్ని కృష్ణమూర్తిగారు వ్యతిరేకించారు. తీర్మానాన్ని ఆమోదించితే యూనియన్ విచ్ఛిన్నమౌతుందని బెదరించాడు. అంటే విచ్ఛిన్నం చెస్తానని యీయన భావం. కాని పాపం తీర్మానానికి వ్యతిరేకంగా 40 మంది కూడా లేరు. తీర్మానం 160 ఓట్లతో గెలిచింది.

ఎన్నికలు

గురుస్వామిగారి పేరు అధ్యక్ష స్థానానికి సూచించబడింది. (మిగతా 6 వ పేజీలో)

ప్రజాసంస్థల నిధికి వరికోతలు

డిసెంబరు 8 వ తేదీ వచ్చింది మంగళాపురం (కృష్ణా) లో ప్రజల ఉత్సాహానికి మేరలేదు మంగళాపురం, ముత్రాసుపాలెం, గొల్లపాలెం, హరిజనపేట, మాదిగపేట, అన్నవరం, ఈనాయపాలెం — మొదలైన గ్రామాలనుండి రైతులు - కూలీలు, స్త్రీలు - పురుషులు, బాలురు - వృద్ధులు అన్నికులాలవారు తండోపతండాలుగా ఉదయం ఊరేగింపులో చేరారు. ఒకచేత్లో ఎర్రజండా, రెండో చేత్తో కొడవలి పుచ్చుకొని, జయజయధ్వానాలతో పాటలు పాడుకుంటూ ముందుకు సాగిపోతున్నారు.

ఎక్కడికి ?

పంటచేనువద్దకు; పచ్చగాపండి, వేయి చేతులతో ఆహ్వానిస్తూన్న వరిచేనువద్దకు. కరువు బాధతో కుమిలిపోయే సోదర దేశీయుల్నిరక్షించేనిమిత్తం వరికోత కోయడానికి. ఈ ప్రాంతంలో మూడేళ్ళక్రితం రైతులు - కూలీలు చల్లపల్లి జమీందారుపై జరిపిన పోరాటంలో సంఘీభావంయొక్క ప్రాధాన్యతను తెలుసుకున్నారు. రైతుసంఘంద్వారా, కూలీసంఘం ద్వారా చైతన్యవంతు లవుతున్నారు. కరువు బాధితుల సహాయార్థం రైతులు - కూలీలు అధికపంటలు యెలా పండించాలో చేసి చూపాలనుకున్నారు. దీనితోబాటు, తమకు నాయకత్వం వహించి, తమ్ము సక్రమమార్గంలో నడిపించే కమ్యూనిస్టుపార్టీ నిధికి ఆ ఒక్కరోజు సంపాదించిన శ్రమ ఫలితాన్ని కానుకగా, యివ్వ నిశ్చయించుకున్నారు.

మొత్తం 230 మంది రైతు-కూలీ యువకులు పరుచూరి కోటయ్యగారి 22 యకరాల వరిపైరును యకరం 1 కి రు. 10 చొప్పున కోతకోశారు. సుమారు 6 గంటల వ్యవధిలో కోత పూర్తిచేసి, పార్టీనిధికి రు. 220 సంపాదించారు.

★

బెజవాడ తాలూకాలో బొడ్డపాడు అనే గ్రామం ఉంది. అక్కడ 1940 కి పూర్వం 3 పార్టీలుండేవి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకొని, కక్షలు సాధించుకోవడం మామూలు. ఆ గ్రామంలో నెమ్మదిగా కమ్యూనిస్టుపార్టీ కేంద్రం ఏర్పడింది. పార్టీ సభ్యులు మూడు పార్టీలవారిని ఒప్పించి, ఐక్య రైతుసంఘాన్ని నిర్మించారు. అప్పటినుండీ గ్రామంలో కక్షలు నశించాయి. కూలీ-రైతు సామరస్యం ఏర్పడింది. గడ్డిపాటలు, ఎరువుల అమ్మకం, కాల్వల మరమ్మతు, ధాన్యంపండు — మొదలైన సమస్యలపై గ్రామరైతుసంఘం, కూలీ సంఘం ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయి.

కూలీలను కంటిరెప్పవలెకాపాడి పోషించే కూలీసంఘాన్ని బలపరచుకోవడం కోసం, ఒకరోజుకూలీ సంపాదించి యివ్వాలని నిశ్చయించుకున్నారు. దీనితో యువజనసంఘం వారికి కూడా హుషారొచ్చింది! కోతకు 3 వ తేదీని కలిసి బయల్దేరారు.

ఎడమచేత్తో ఎర్రజండా, కుడిచేత్తో కొడవలి పుచ్చుకొని 100 మంది రైతు-కూలీలు ఊరేగింపుగా వెళ్లారు. అక్కినేని వెంకట్రాయులుగారి 10 యకరాల చేలో ప్రవేశించారు. జండాలు చేనిచుట్టూ నిలబెట్టారు.

"పచ్చపచ్చగపెరిగి పండిఒరిగున్నాను" "మాసొక్కపొరిమేరలోన...." అనేపాటలతో కోత ప్రారంభమయింది, బ్రాహ్మణ, కమ్మ, తెలగ, గొల్ల, కాపు, మాల-కులాలవారంతా కోతల్లో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు పని పూర్తిఅయింది. కూలీసంఘానికి రు. 75, యువజనసంఘానికి రు. 25 వచ్చాయి.

★

10వ తారీకు ఉదయం యడ్లపల్లి(గుంటూరు జిల్లా)గ్రామయువకులు, వృద్ధులు, హిందువులు, ముస్లింలు, చేనేతపనివారు మొత్తం 40 మంది ఊరేగింపుతో కమ్యూనిస్టుపార్టీ సహాయార్థం కోతకు బయలుదేరారు. వృద్ధులు చేనుదాకా సాగనంపారు. 40 మంది చేలో వంగి "పచ్చపచ్చగపెరిగి పండిఒరిగున్నాను" అనేపాటతో కోస్తూవుంటే చూట్టానికి చుట్టుప్రక్కల రైతులువచ్చి " వీళ్లు చెప్పినంతా చేస్తారురా" అనేఅభిప్రాయంతో అభినందిస్తూ వెళ్లిపోయారు ఈకోలాహలంచూచి, పోలేక ఒక వృద్ధ చేనేతకార్మికుడు కోతకోసి యువకులను ఉత్సాహపరిచారు. మొత్తం, ప్రక్క కూలీలకన్న ఎక్కువకోసి పనిచేయగలమనే దాన్ని రుజువుచేశారు. మధ్యాహ్నము అందరూ కాల్వగట్టుపై వరుసనే (హిందూ-ముస్లింలు)కూర్చుని అన్నంతింటూ సంతోషంగా కబుర్లుచెప్పేవారినిచూచి, ఎవరు హిందూ-ముస్లిం ఐక్యత సాధ్యముకాదనగలరు? చేను రైతుకూడ ఉత్సాహపడి తాను కూడాకోశాడు. సాయంకాలం ఊరేగింపుచేసుకుంటూ వచ్చి యిక్బల్‌గ్రంథాలయం వద్ద మీటింగు పెట్టుకున్నారు దానిలో తాలూకా కమ్యూనిస్టు కమిటి ఆర్గనైజరు కంతంనేని గోపాలరావు, కమ్యూనిస్టుపార్టీ సాంప్రదాయాలు, కష్టజీవులకై ఎలా వివిధసంఘాలలో పనిచేయుచున్నదీ చెప్పారు. తర్వాత యన్. మహబూబ్ (జిల్లా ముస్లింలీగు ఆర్గనైజింగు కమిటీ సెక్రటరీ) ప్రజాసంస్థకు సహాయము చేసిన ప్రజల నభినందించారు. మీటింగు విని ఒకాయన "మీవంటి సేవకులను పోగొట్టుకోటానికి కాంగ్రెసు ఒప్పుకుంటుందా?" అని ప్రశ్నించారు.

★

ఇలాగే గోళ్ళమూడిపాడు (గుంటూరు జిల్లా) గ్రామంలో 6 వ తేదీని గ్రామ యువజన సంఘానికి రు. 25 లభించాయి.

ఈవిధంగానే యితర గ్రామాలలోకూడ అన్నివర్గాల ప్రజలు, అన్ని కులాలవారు కొత్తపంటను స్వయంగా తీసుకొని, ఏగ్రామానికాగ్రామం ఆహారసమస్యను పరిష్కరించుకొంటూ, మిగులు ధాన్యాన్ని కరువు ప్రాంతాలకు చేరేలా జాగ్రత్తపడి, మరోవైపు తమ శ్రమ ఫలితాన్ని ప్రజాసంస్థలకు వినియోగిస్తే దేశంలో కరువు లేకుండా చేసుకోవచ్చు.

★

ఇలాగే, భీమవరం తాలూకా (ప. గోదావరి)లో డిసెంబరు 1 వ తేదీని 4 యకరాల 10 సెంట్ల భూమిలో 12 గురు కోతకోసి, పార్టీనిధికి రు. 19 సంపాదించారు. 5 వ తేదీని 30 మంది యువకులు 4 యకరాల 25 సెంట్ల భూమిలో కోతకోసి, 8 యకరాల 50 సెంట్లలో కట్టివేతలువేసి, మొత్తం రు. 66 సంపాదించారు. ఏలూరుతాలూకాలో పాలగూడెంఅనే గ్రామంలోకూడ వ్యవసాయ కూలీసంఘసభ్యులు చిట్టి గురవయ్యగారనే రైతు పొలంలో కోతకోసి, పార్టీనిధికి రు. 15 సంపాదించారు.

కోవూరుతాలూకా (నెల్లూరు) లేగుంటపాడులో 9 వ తేదీని 13 గురు యువకులు కోతలుకోసి, పార్టీకి రు. 7½ సంపాదించారు.

కోత పాట

కోయ్ కోయ్ కోత గోయ్-ఓదెలేయ్-ఊ!
కోతగోయ్ - కుప్పవెయ్ - కూలన్నా!
కోసి నూర్చావేర రైతన్నా!

1. విశాఖ, పలనాడు, మలబారు, బెంగాలు
నలుమూలలాకరువె ప్రళయమైపోయింది
కరువువాతనుబడ్డ ప్రజలు వేనకువేలు
కాలేటి పొట్టల్లా గంజైన పొయ్యంగ
వారికి ధాన్యమ్ము చేరాలి వేవేగ॥ కోయ్॥

2. చెమటకాల్వలుగట్టి చేలోన ప్రవహింప
రాజనాలాపంట రాలేను ఈయేడు
ప్రజల కన్నొరగించే తిండిదొంగలకమ్మి
చీకటికొట్లల్లో పంటంతా
చివికింపనిత్తుమా రైతన్నా॥ కోయ్॥

3. మేకవన్నెపులులు నీకడకువస్తాయి
తిండిదొంగలు నీచుట్టు తిరుగుతారికమీద
కనుగలిగి మెసలాలి కూలన్నా
కావికాలామెచ్చె రైతన్నా॥ కోయ్॥

4. కల్లబొల్లి అల్లమాట కారివిగాదు
కరువుదీర్చగ నేడు కష్టపడిపండించు
కార్యవాదివినీవె కాపన్నా
దేశభక్తుడవీవె రైతన్నా॥ కోయ్॥

5. కాంగ్రెస్సులీగులు కలసిపోరేలాగ
కూలీలు రైతులం గొప్పకృషిచేసి
దానిసా బంధాలు రైతన్నా
వరసరాగొయ్యాలి కూలన్నా॥ కోయ్॥

6. వంచినా నడుమును ఎత్తకుండానీవు
పట్టినాకొడవలి విడువకుండానీవు
కోతగాయ్ కుప్పవెయ్ కూలన్నా!
కోసి నూర్చావేర రైతన్నా!

— కొత్తపల్లి రంగారావు

★ మొఖాసా గ్రామంలో

రైతులు - కూలీలు సాధించిన హక్కులు

— కడియాల పిచ్చయ్య

నూజివీడు తాలూకాలో వట్టిగుడిపాడు అనే మొఖాసాగ్రామం ఉంది. అక్కడి రైతులు - కూలీలు తమ న్యాయమైన హక్కులను సాధించుకునేటందుకు నవంబరు 19, 20 తేదీలలో పనులకువెళ్ళడం మానివేశారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి తాలూకా రైతుసంఘ కార్యదర్శి పొట్లూరి వీరరాఘవయ్యగారు, తాలూకా కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజరు అయిన నేను, కలిసివెళ్ళి రైతు - కూలీల కోర్కెలు తెలుసుకున్నాము. వెంటనే మొఖాసాదార్లవద్దకు రాయబారం వెళ్ళాము. కాని, వారిలో ముఖ్యులు ఊళ్ళో లేరు. అందువల్ల రాయబారం 24 వ తేదీకి వాయిదా వేశాం.

ఈలోగా వరిచేలు కోతకు వచ్చాయి. పనులుమాని యిలాగే కూచుంటే, పంటలో కొంతనష్టం కాకతప్పదు. అలా నష్టం అవుతూంటే చూస్తూ కూర్చోడం యెలా కరువు బాధితుల అన్నంలో మట్టికలపడమో వివరించి చెప్పారు. దానిమీదట, రైతులు - కూలీలు పనులకు వెళ్ళడాని కంగీకరించారు. 25 వ తేదీని రైతు - కూలీ ప్రతినిధులు మొఖాసాదార్ల వద్దకు రాయబారం వెళ్ళారు. అనేక సమస్యలపై కలిసి చర్చించిన మీదట ఒక అంగీకారానికి వచ్చారు. 25-11-44 వ తేదీ రాత్రి జరిగిన బహిరంగసభలో యీ క్రింది ఒడంబడిక షరతులను చదివి వినిపించాము:

1. లోగడ కూలిరేట్లు పురుషునికి 4 సేర్లు, స్త్రీకి 2½ సేర్లు ధాన్యం యిచ్చేవారు. ఇప్పుడు 5 సేర్లు, 3½ సేర్లు చొప్పున సంవత్సరం పొడుగునా సిఖా మానికతో యిచ్చుట కంగీకరించారు. కూలీలు ప్రతిరోజు మధ్యాహ్నం 11 మొదలు సాయంత్రం 6 గంటలవరకు (అనగా 7 గంటలు) పనిచేయాలి.

2. పాలేళ్ళకు నెల 1కి యిస్తూన్న 52 మానికల ధాన్యాన్ని సిఖా మానికతో కొలిచియివ్వాలి. రెండేళ్ళ కొకసారి ప్రతి పాలేరుకు ఒక గొంగడి చొప్పున యివ్వాలి.

3. ఇంతవరకు రైతులు భుక్తపరచుకొని సేద్యముచేసేభూమిని జిరాయితీ భూమిగా గుర్తించి, శిస్తునుమాత్రమే రైతువద్ద తీసుకోవాలి. అట్టి భూములలోవున్న తాటి, ఈత చెట్లను రైతులే గీతకుయిచ్చి, మొదలు పన్నును అనుభవించాలి.

4. మాదిపీడు - అగిరపల్లి రోడ్డుక్రింద పోయిన చాకళ్ళ యినాముకుగాను జిల్లాబోర్డు వారిచ్చిన పరిహారపు సొమ్మును మొఖాసాదార్లే తీసుకున్నారు. ఆ సొమ్ముకు ప్రతిఫలంగా కొంతభూమిని 1945 మే నెలలోగా యివ్వాలి.

5. గ్రామ అరణ్యమును యిజారా యివ్వటకుమారు. మూడునాలుగేండ్ల కొకసారి ఎండిపోతూన్న బంజేరు కంపనుమాత్రమే యిజారా పెట్టాలి. దానిపై వచ్చే పైకంతో చెరువులను మరమ్మతు చేయించాలి.

6. కురుదుచెరువులో వున్న మెరక భూమును పల్లపుభూముతో సమానంగా చేయుటకు చెరువులోని ఒండ్రుమట్టిని రైతులందరు తమ చేలలోకి తోలుకోవచ్చును.

ఇవిగాక, సరిహద్దు తగవుల సమస్య, మెరక పల్లమునకు నీటిహక్కు సమస్య, తెలగాల దేవాలయం సమస్య - వీటిపైకూడా ఒడంబడిక జరిగింది

★

బెజవాడ తాలూకా, పొందుగల గ్రామంలో 4-11-44 వ తేదీని కూలిరేట్ల విషయంలో రైతులమధ్య - కూలీలమధ్య ఒక ఒడంబడిక జరిగింది. వేరుసెనగకాయ కోతలో రద్పు 1కి రు. 0-5-9 కు తగ్గకుండాను, హెచ్చకుండాను, యిచ్చుటకు రైతులంగీకరించారు. కొత్తవరిపంటల్లో రైతులు తమవద్దనున్న మిగులు ధాన్యాన్ని కంట్రోలు రేటుకే కూలీలకు అమ్మాలి.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సరం చందా	5—0—0
అర్థసంవత్సరం చందా	2—8—0
మూడునెలలచందా	1—4—0

కరువునివారణ కృషికి వివిధపక్షాల ఐక్యత

"మన విశాఖజిల్లాలో ప్రజలు తిండిలేక ప్రాణాలు విడుస్తూంటే మనమింతవరకు ఏం చేయగలిగాం? పట్టెడన్నం కోసం మానవతులు తమ శీలాన్ని అమ్ముకొంటూంటే, మనం కదలకపోవడం శోచనీయం కాదా? మానవ హృదయం ఉన్న ప్రతివ్యక్తీ రాజకీయ విభేదాలతో ప్రసక్తిలేకుండా, తక్షణమే నడుంబిగించి ముందుకు సాగాలి. ప్రజాప్రతినిధులతో గూడిన ఐక్యకరువు నివారణ కమిటీని యేర్పరచి, కరువు బాధితులకు తోడ్పడాలి."

— అంటూ శ్రీ కె. ఎన్. గుప్తగారు (కాంగ్రెసు ఎం. ఎల్. ఏ.) 30—11—44 సాయంత్రం విశాఖపట్నం జిల్లా కరువునివారణ మహాసభ కధ్యక్షత వహిస్తూ ఉద్బోధించారు.

జిల్లాలో అన్ని ప్రాంతాల నుండి ప్రజాసేవకులు, దేశభక్తులు హాజరయారు. అన్నార్తులగు ప్రజల్ని రక్షించే దెలా? అనేఆతృత పలికుల ముఖాల్లో ప్రస్ఫుటమయింది.

కామ్రేడ్ కొన్నంగడ్డ రామలింగయ్య (జిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి) గత ఆరుమాసాలలో జిల్లా యందలి దేశభక్తులందరినీ కరువునివారణకై ఐక్యపరచడానికి జరిగిన కృషిని వివరించాడు. ఇన్నాళ్ళకు ఆ ప్రయత్నం ఫలించినందుకు సంతోషాన్ని వెలిబుచ్చాడు.

గుప్తగారు తమ అధ్యక్షోపన్యాసంలో, తాము గత ఫిబ్రవరిమాసంలో స్వయంగా ఉత్తరవిశాఖను చూచినప్పుడే ప్రమాదాన్ని గుర్తించగలిగామనీ, వెంటనే నిజపరిస్థితులపై ప్రభుత్వాని కొక రిపోర్టు నందచేశామనీ చెప్పారు.

జూలై లగాయతు ఆంధ్రరాష్ట్రరైతుసంఘం ఉత్తరవిశాఖ కరువునివారణకు చేసిన పనిని గూర్చి కామ్రేడ్ కె. గోవిందరావు (జిల్లా రైతుసంఘ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి) రిపోర్టు యిచ్చారు. 12 గురు రైతుసంఘ వాలంటీర్లు వేర్వేరు కేంద్రాలలో ఉండి చేస్తున్న కరువునివారణప్రయత్నాలను విశదీకరించాడు. వారిలో ముగ్గురు వాలంటీర్లు (కడియాల కోటీశ్వరరావు, బి. రాఘవరెడ్డి, మన్నే వీరయ్యగారలు) శ్రోతలహృదయాలుకరిగేలా తాముచూచిన కరువుదృశ్యాలను వర్ణించారు.

తరువాత, ప్రతినిధులు యీ క్రిందివారితో గూడిన జిల్లా కరువునివారణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షులు :

కె. ఎస్. గుప్తగారు (సెంట్రల్ ఎం.ఎల్ ఎ.)

ఉపాధ్యక్షులు :

1. డాక్టరు సంజీవరావుగారు (విజయనగరం)
2. బి. నాగేశ్వరశాస్త్రిగారు (తుపాను బాధానివారణకమిటీ కార్యదర్శి)
3. ద్వారం వెంకటస్వామినాయుడుగారు (ప్రిన్సిపాల్, సంగీతకళాశాల, విజయనగరం)
4. కె. ఎస్. దత్తుగారు (కంట్రాక్టరు, విశాఖపట్నం)
5. ఎం. పట్టాభి రామిరెడ్డిగారు, (చైర్మన్, మునిసిపల్ కౌన్సిల్, విశాఖపట్నం)
6. దిగుమర్తి రామస్వామిగారు (కాంగ్రెసు ఎం. ఎల్. ఎ.)
7. వి. జె. గుప్తగారు (ఎం. ఎల్. ఎ. విశాఖపట్నం)
8. పొట్నూరి స్వామిబాబుగారు (నరసన్నపేట)

ప్రధానకార్యదర్శి : కె. గోవిందరావుగారు (జిల్లారైతుసంఘ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి)

సంయుక్తకార్యదర్శి : మిస్సుల సూర్యనారాయణగారు (మాజీ జిల్లాకాంగ్రెసు కమిటీ అధ్యక్షులు)

కోశాధికారి : డి. వి. గంగరాజుగారు (ఆడిటర్, విజయనగరం)

సభ్యులు

1. విజ్ఞాపురపు ఆనందరావుగారు (ఎడ్వొకేట్, విశాఖపట్నం)
2. వై. విజయకుమార్ (జిల్లా కమ్యూనిస్టుపార్టీ సభ్యులు)
3. డాక్టరు బి. పేరరాజుగారు (అనకాపల్లి)
4. బెందాళం గవరయ్యగారు (సోంపేట)
5. గేదెల చంద్రయ్యనాయుడుగారు (ఉత్తర విశాఖజిల్లా కాంగ్రెసు అసెంబ్లీఅధ్యక్షులు)
6. మొయిద బంగారురాజుగారు
7. గొట్టెముక్కల సత్యనారాయణరాజుగారు
8. శశిభూషణగుప్తగారు (నరసన్నపేట)
9. బుద్ధిరాజుమల్లికార్జునరావుగారు (ఎడ్వొకేట్, విశాఖపట్నం)
10. ఎ. పుండరీకాక్షచారిగారు, (జిల్లాకాంగ్రెసు అసెంబ్లీ కార్యదర్శి)
11. గ్రంధి కన్నయ్యవంతులుగారు (అనకాపల్లి)
12. కొల్లూరు వీరభద్రరావుగారు (విశాఖపట్నం)
13. గొట్టెముక్కల జగన్నాధరాజుగారు (జిల్లాబోర్డు ప్రెసిడెంటు)

18 బాబూలాల్‌గారు (విశాఖపట్నం)

★

చీపురుపల్లి తాలూకాలో కాటకపరిస్థితులు

చీపురుపల్లి తాలూకా (ఉత్తరవిశాఖ) లో యీ నాడు అధికజనం పస్తులతోపడిఉన్నారు. ఇప్పుడమలులో ఉన్న రేషనింగు ప్రకారం, ఐదవవంతు జనానికి మాత్రం రేషనుబియ్యం దొరుకుతున్నాయి. ఉదాహరణకు, ఈక్రింది గ్రామాల పరిస్థితి చూదాం. దళ్లవలస, పిళ్లవలస, ధర్మపురం, పెంకిపేట, సీపానపేట, సువ్వారుపేట, గొర్లెపేట, తోలాపి, షేకుమహమ్మదు పురం, కేశవరావుపేట, లింగాలిపేట, పరీదుపేట, లచ్చుదుపేట, దానోజీరావుపేట, బురిడి కంచరాం, మజ్జిలపేట, గోరింట, రాపాక, తుంగపేట, మెల్లయ్యపేట, కోటిపల్లి, వావిళపల్లిపేట — ఈ 22 గ్రామాల జనసంఖ్య 16382. ఈ గ్రామాలకు వచ్చే బియ్యం కోటా 160 మణుగులు (వారానికి) ఇది 3330 మందికి మాత్రమే సరిపోతుంది, అదైనా 3 రోజులే! మిగతా దినాలలో దొంగ మార్కెటు, ఉపవాసాలే శరణ్యం! తాలూకాలో ఉన్న మొత్తం గ్రామాలు 326. ఇందులో సగం గ్రామాల పరిస్థితి యించుమించు ఇలాగేవుంది. కూలీలలో చాలామంది వలసపోవుటచే, పల్లపుభూములలో అయినా కోతలకు మనుష్యులు లేరు. ఉదాహరణకు పై 22 గ్రామాలలో 4234 యకరాల పల్లపుభూమి ఉంది. ఇందులో కోతలుకోసిన భాగం 164 యకరాలు మాత్రమే! (అదైనా పావలా పంట) ప్రభుత్వం వెంటనే యీ క్రింది సూచనలను పాటించాలి.

1. కొత్తపంట వచ్చేవరకు, కోతలుకాని గ్రామాలకు, వర్గభేదం లేకుండా అందరికీ పూర్తి రేషన్ యివ్వాలి.
2. చెరువులు, కాల్వలు తక్షణమే మరమ్మతు చేయించాలి.
3. జమీందారీ గ్రామాలలో రైతులకు పూర్తి శిస్తురెమిషన్ వచ్చేటట్లు చూడాలి.
4. తాలూకా కరువునివారణ కమిటీని ప్రభుత్వం గుర్తించాలి.

— ఎం. అబ్బాయినాయుడు

మదనపల్లితాలూకాలో మలేరియా

శ్రీయుతులు టి యస్. రామకృష్ణారెడ్డి (యం. యల్. ఎ.), యం. వి. పాపన్న గుప్త (ఆంధ్రమహాసభ కార్యవర్గ సభ్యులు), రాటకొండ నరసింహారెడ్డి (రాష్ట్ర రైతుసంఘ కార్యవర్గ సభ్యులు) గార్లు మదనపల్లి తాలూకాలో మలేరియా ప్రమాదాన్నిగూర్చి యిలా వ్రాస్తున్నారు:—

రెండు నెలలుగా తాలూకా అంతటా మలేరియా చెలరేగుతూ ఉన్నది. గ్రామాల్లో వందలకొలది ప్రజలు మృత్యువు వాతపడుతున్నారు. సాగుబడి తరుణంవచ్చి, చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉన్నా, జ్వరపీడితులైన రైతు వ్యవసాయానికి పూనుకోలేని దుర్భరస్థితిలో ఉన్నారు.

కొత్తకోట, చీరంగి, కందుకూరు, పెద్ద తిప్పసముద్రం, బూర్లపల్లి, రంగసముద్రం, పట్టేవాండ్లపల్లి, కాట్నగల్లు యిత్యాది గ్రామాల్లో సుమారు సగానికి సగం ప్రజలు మలేరియా పీడితులైనారు. వీరిలో నూటికి 60 మందికిజ్వరగడ్డలు (enlarged spleens) కూడా యేర్పడ్డాయి. గత మూడుమాసాల్లోను పైగ్రామాల్లో దాదాపు ప్రతి గ్రామంలోనూ 150 మందికి తక్కువలేకుండా చనిపోయి ఉంటారు. దాదాపు అన్నిగ్రామాల్లోనూ వ్యవసాయం దెబ్బతిన్నది. తాలూకా అంతటా వ్యాపించిన యీ ప్రమాదాన్ని ప్రభుత్వం బొత్తిగా గుర్తించినట్లులేదు. వేలకొలదిగా నున్న తాలూకా అంతటిలో ఒక్క హెల్తు ఆఫీసరు మాత్రమే ఏజంట్లద్వారా "సింకోనా" మాత్రలు ప్రజలకు పంచిపెడుతున్నాడు. 90 గ్రామాలున్న తాలూకాలో నెల 1 కి 40 పౌనులు (4000) మాత్రలు మాత్రమే సప్లయి చేస్తున్నారు. ఇవి యెంతమాత్రం చాలవు. పైగా మాత్రలుపంపకం చేయడంలో గూడా లోపాలుండడంచేత, బీదసాదలైన జ్వరపీడితులకు ఆ కొద్దిమాత్రలు గూడా అందడంలేదు.

ప్రభుత్వం ఈప్రమాదపరిస్థితిని గుర్తించి, వెంటనే మదనపల్లి తాలూకాను మలేరియా ప్రాంతంగా నిర్ణయించాలి. మలేరియాను నిర్మూలించడానికై ప్రత్యేక కృషి చేయాలి. ప్రభుత్వం యీ క్రింది సూచనలను అమలులో పెట్టాలి.

(1) కొత్తకోటను కేంద్రంగా యేర్పరచుకొని నివారణ కార్యక్రమం సాగించాలి.

(2) హెల్తు యినస్పెక్టరుకు సహాయంగా ప్రత్యేక శానిటరీ యినస్పెక్టర్లను, యితర స్టాఫ్‌ను నియమించాలి.

(3) సింకోనామాత్రలు నెలకు కనీసం 500 పౌనులు సప్లయిచేయాలి.

(4) జ్వరగడ్డలకు ప్రత్యేక చికిత్సచేస్తూ, దోమలు బాగా వ్యాపించిన ప్రదేశాలలో విరివిగా మందునీటిని చల్లాలి.

(5) మాత్రల పంపకంలోను, యితర చికిత్సలలోను "మలేరియా నివారణ ప్రజా కమిటీల" సహకారం తీసుకోవాలి.

ప్రజలు గ్రామ గ్రామానికి "మలేరియా నివారణ ప్రజాకమిటీలు" యేర్పరచి కృషి చేయాలి. ఈనాడు మలేరియాను అరికట్టలేక పోతే, రేపు కరువును నివారించలేమని గుర్తించాలి.

కృష్ణాజిల్లాలో ఆటల పోటీలు

"విజ్ఞాన బలసంపదలు గల్గిన యువకులే దేశాభ్యుదయానికి వెలుగుచుక్కలు" - ఈ ఆదర్శంతో కృష్ణాజిల్లా యువజన సంఘం 1935 లో స్థాపింపబడి, యువకుల శారీరక, వైజ్ఞానిక, రాజకీయాభివృద్ధికై కృషిచేస్తూంది. జిల్లాలో 325 గ్రామాల్లో 14,000 సభ్యులు గల్గి ఉన్నది.

క్రిందటి సంవత్సరం ఆటలపోటీలలో 1360 మంది ఆటగాండ్రు పాల్గొన్నారు. ఈ సంవత్సరం వివిధకేంద్రాలలో జరిగిన జిల్లా, తాలూకా, పట్టణ పోటీలలో 1500 మంది పాల్గొన్నారు.

చెడుగుడులో అన్ని కేంద్రాలలో 140 టీములు పాల్గొన్నాయి. జిల్లా పోటీలలో విన్నర్సుగా గోపవరం టీము (కైకలూరు తాలూకా). రన్నర్సుగా వెన్ననపూడి టీము (గుడివాడ తాలూకా)లు గెలిచాయి.

కొక్కులో 16 టీములు పాల్గొన్నాయి. విన్నర్సుగా పెన్మత్సటీము, రన్నర్సుగా చినఓగిరాల టీము వచ్చాయి.

గుండు విసరుటలో 70 మంది పాల్గొన్నారు. (అందరికన్న ఒకయువకుడు 31.4 అడుగులు విసరాడు) 100 గ॥ పరుగులో 45 మంది పాల్గొన్నారు. (ఒక యువకుడు 10 క్షణాల్లోనే పరుగెత్తగలిగాడు.) బంతి విసరడంలో 50 మంది పాల్గొన్నారు. (287.9 అడుగులువిసరాడు); లాంగ్‌జంప్‌లో 78 మంది పాల్గొన్నారు. (ఒకరు 18 8 అడుగులు దూకారు); హర్డిల్స్‌లో 20 మంది, పోల్‌జంప్‌లో 40 మంది (మిగిలినవారికన్న ఒకరు 8.4 అడుగులు దూకారు) పాల్గొన్నారు; హైజంప్‌లో 60 మంది పాల్గొన్నారు. (అధికంగా దూకింది 5 2 అడుగులు) మోకులాగడంలో 10 టీములు, సైకిల్ త్రొక్కడంలో 25 మంది పాల్గొన్నారు.

అన్ని కేంద్రాలలో నాలుగైదురోజులు కార్యక్రమం జరిగింది. అదే సమయంలో వైజ్ఞానికపోటీలు, మహాసభలు జరిగాయి. అన్ని ప్రదర్శనాలకు 50 వేలకుపైగా ప్రజలు హాజరైనారు. రు. 4000 లు వసూలై కార్యక్రమానికి వెచ్చించబడ్డాయి. ఎక్కువ మొత్తం ఆటగాండ్రవద్దనే వసూలు చేయబడ్డాయి.

ఈ విధంగా కృష్ణాజిల్లా యువజనసంఘం తన 9 సంవత్సరాల జీవితంలో సాధించిన సత్సంప్రదాయాలను నిలబెట్టుకుంటూ మరిపెంతో ముందుకు సాగిపోతూంది.

ఇట్లు,
కాతినేని సూర్యప్రకాశరావు,
కృష్ణాజిల్లా యువజనసంఘ కార్యదర్శి.

"ఈమార్పులవల్ల మనధర్మంగాని మనమతంగాని క్షీణించదు"

— గోపాలరెడ్డి

హిందూ లా సవరణకు ఆమోదం

నెల్లూరు టౌన్‌హాల్లో రావుకమిటీబిల్లును బలపరచటానికి 5-12-44 న జరిగిన సభలో ప్రజలు క్రిక్కిరిసిపోయారు. రెండువేలమంది హాజరయ్యారు. ఇటీవల జరిగిన సభల్లో కల్లా యిదే పెద్దది. స్త్రీలు చాలామందివచ్చారు.

టౌన్‌లోని ప్రముఖ వకీలు శ్రీ బి. రామస్వామయ్యగారు అధ్యక్షత వహించారు. "హిందూ న్యాయశాస్త్రంలో ఎన్నోమార్పులు ఇప్పటికే జరిగినవి. శతాబ్దాలనుండీ వున్న హక్కులు మారినవి. కనుక మార్పునే వ్యతిరేకించుట తప్పు. అది ఉచితమా, అనుచితమా అని గమనించవలసి యున్నది" అన్నారు.

శ్రీ వి. వి. రెడ్డి ఎం. ఏ. ఎల్. ఎల్. బి. గారు (వి. ఆర్ కాలేజి ఆర్థిక శాస్త్రోపన్యాసకులు). నేడు అహమ్మదునగరులో జైలులో మ్రగ్గుతున్న జవహర్‌లాల్‌నెహ్రూగారు సివిల్ కోడ్ కావాలన్నారనీ. గాంధీగారుగాని ఇతర కాంగ్రెసునాయకులుగాని న్యాయదృష్ట్యా స్త్రీపురుష భేదాలు, కులభేదాలు వుండడం సహించరనీ చెప్పినారు. 480 మంది వారసులుండే హిందూన్యాయశాస్త్రం నేటి పరిస్థితులకు తగదన్నారు. బిల్లులో పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులుండేటట్లు మార్పులు చెయ్యాలన్నారు. పైగా యీ బిల్లు వ్యవసాయభూములకు అన్వయించదు గనుక, దీనివల్ల ప్రయోజనం తగ్గుతుంది. కనుక వైస్రాయిగారు రాష్ట్ర విషయాలపై తనకుగల ప్రత్యేకహక్కును వినియోగించి వాటికిగూడా అన్వయింపజేయాలన్నారు.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు వ్యతిరేకుల వాదనలన్నిటినీ ఖండించారు. "హిందూ సంఘంలో అనేక మార్పులు వస్తున్నాయి. చచ్చిపోయిన భర్తతో సజీవమైన భార్యను కాల్చివేస్తున్నప్పుడు దాన్ని అరికట్టవలెనంటే సనాతనులు వ్యతిరేకించినారు. కాని వారిని నిర్లక్ష్యంచేసి ప్రభుత్వం శాసించడంవల్ల మేలే కలిగింది. వీరేశలింగం వంటివారు ప్రచారం చేస్తున్నప్పుడు సనాతనులు విధవా వివాహాలు వద్దన్నారు. కాని ప్రభుత్వం ఇష్టముంటే చేసుకోవచ్చునన్నది. అదేవిధంగా శారదా చట్టం వచ్చింది. వీటివల్ల సంఘం ముందుకు వస్తున్నది. ఈమార్పులవల్ల మనధర్మంగాని, మన మతంగాని క్షీణించదు. వీటిని వ్యతిరేకిస్తేనే క్షీణిస్తుంది. హిందూ ధర్మ సంఘటన చేసుకోవడమంటే అభివృద్ధిని వ్యతిరేకించడంగాదు. మార్పులను వ్యతిరేకించుతుంటే మతం క్షీణించకుండా, మన హరిజనులు, ఇతరులూ అన్యమతాల్లో చేరకుండా ఆపలేం" అన్నారు.

గంగాధరంగారు స్త్రీల వోటింగ్ విషయంలోను, 1931 లో ప్రాథమిక స్వత్వముల తీర్మానంలోను, తర్వాత నేషనల్ ప్లానింగ్ కమిటీ నివేదికలోను కాంగ్రెస్ ఏ విధంగా అభ్యుదయమార్గాన్ననుసరించిందో చూపారు.

పొణకా కనకమ్మ, ఏ. అక్కిరాజు బి ఏ. బి. ఎల్. గార్లు గూడా మాట్లాడారు.

సభ జరుగుతున్నంత సేపూ హిందూమహాసభ వాదులూ, త్రాగివచ్చిన వారి అనుచరులూ గలభాచేస్తూ సభను భగ్నపరచడానికి ప్రయత్నించారు. వీరి చర్యలను ప్రేక్షకులంతా అసహ్యించుకున్నారు. అందువల్ల వారి తరపున నలుగురిని (హిందూమహాసభ అధ్యక్షుడు, కార్యదర్శి, ఆర్యసమాజం అధ్యక్షుడు, ఇంకొకరు) మాట్లాడనిచ్చినపుడు, వారి ప్రసంగాలలో, బిల్లులోని తప్పులు చూపలేకపోయారు.

హిందూమహాసభ కార్యదర్శి కాళహస్తి రామనాథంగారు వారసత్వాన్నిగూర్చి మాట్లాడిన వారికి బిడ్డలులేరనీ. కమ్యూనిస్టులు హిందువులుకారనీ ఏవేవో అసత్యంగా ప్రలాపించారు. శ్రీ గోపాలరెడ్డిగారు వీరందరికి సరియైన సమాధానాలిచ్చారు.

ఈ సభవల్ల టౌన్‌లో బిల్లునుగూర్చి స్త్రీపురుషుల్లో బాగా సంచలనం కలిగింది.

1-12-44 న కాలేజీ గరల్స్ అసోసియేషన్ సభలోగూడా యీ బిల్లు నామోదిస్తూ తీర్మానించబడింది.

★

రాజమండ్రి

పట్టణ మహిళా సంఘం 10-11-44 న సమావేశమై రావుకమిటీ బిల్లును కొన్ని సవరణలతో అమలు జరపాలని తీర్మానించింది.

★

పాములపాడు

27-11-44 న పాములపాడు గ్రామ మహిళాసంఘం చంద్ర సావిత్రిదేవిగారి అధ్యక్షతను సమావేశమై బి. యన్. రావ్ కమిటీ చిత్తుచట్టాన్ని కొన్ని సవరణలతో సూచించారు. "తండ్రి, తల్లి, అన్నలలో స్త్రీపురుష వివక్షత లేకుండా ఆస్తిలో సమానమైన భాగాలు ఇవ్వాలనీ; తల్లిఆస్తిలో జన్మతః వచ్చే ఆస్త్రీహక్కును నిరాకరించడం అన్యాయమని భావించుతూ, అట్టి హక్కును కల్గించాలనీ; విడాకు ఇవ్వడానికి 7 సంవత్సరాల కాలపరిమితి దీర్ఘమనీ, 3 సంవత్సరాలుంటే సరిపోతుంద" నీ సవరణలు సూచించారు. 1946 జనవరి నాటికి దీనిని శాసనరూపంలోకి తీసుకురావాలని కోరారు.

బెజవాడలో బియ్యంకరువు

1944 సెప్టెంబరులో బెజవాడలో బియ్యం రేషనింగుఅమలులోకివచ్చింది. నెలకుదాదాపు 17000 బస్తాల బియ్యం ఖర్చుగునని అంచనా వేయబడింది. అయినా గత మూడునెలల అనుభవాన్నిబట్టి నెలకు 12000 బస్తాలకంటె ఎక్కువ ఖర్చుకావడంలేదు. బియ్యం సప్లయికి గాను, మొదట, 4 మిల్లులను రేషనింగు మిల్లులుగాఏర్పరచారు. కాని గత నెలనుండి, బెజవాడలోనున్న అన్ని మిల్లులనుండి, ఎక్కడున్నా చిల్లర డిపోలకు బియ్యం యిచ్చారు. కారణం? ఆనాల్గు మిల్లులు సరిపడిన బియ్యాన్ని యివ్వలేకపోయాయి. ఈకాలంలోనే బియ్యం పెచ్చుధర కమ్మినారని, నిర్ణీత ప్రమాణంగల పాలిష్ లేదని, కొన్ని మిల్లులపై కేసులు పెట్టబడి, జరిమానాలు విధించబడ్డాయి. ఈనాడు దాదాపు అన్ని మిల్లులూ పనిచేయుటలేదు. కారణం? సరుకు లేదని, ఏవో యంత్రాలు చెడ్డాయని, సాకు చెబుతున్నారు.

బాధ్యత ధాన్యసేకరణాధికారిదే

" పట్టణానికి కావలసిన బియ్యాన్ని యావత్తు గ్రెయిన్ పర్చేజింగు ఆఫీసరే సప్లయిచేయాలి. నిల్వలు అయిపోతున్నాయని రేషనింగు ఆఫీసరు పదేపదే తెలియపరిచినా, తనకే మిల్లులలోని స్టాకువివరాలు తెలిసినా, నిర్లక్ష్యంగా కూర్చున్నాడు. చెడ్డబియ్యం యిచ్చిన మిల్లుయజమానులపై రేషనింగు ఆఫీసరు జరిమానా విధించినందులకు ఆగ్రహపడుతున్నాడు. అందువలననే ఫ్యాక్టరీలు ధాన్యాన్ని తేవటంలేదంటున్నారు. మనుష్యులుతినటానికి వీలులేని బియ్యాన్ని ఫుడ్ ఇనస్పెక్టర్లు సర్టిఫై చేస్తున్నారంటే. వర్తకులకు లోబడి ప్రజలను యిబ్బంది పెట్టుతున్నారన్నమాట. అలాంటప్పుడు రేషనింగ్ ఆఫీసరు చర్యతీసికోవటం అత్యవసరంగాదా? అంతేగాదు. తమవద్దనున్న మంచి బియ్యాలను (సన్నబియ్యం) ధరలు పెరుగుతాయి గనుక అమ్మవద్దని మిల్లుయజమానులకు సలహాయిస్తున్నాడట. ఇకనేం? మిల్లుయజమానులు ధీమాగా కూర్చున్నారు. ఫలితం?

నేడు బెజవాడలోవున్న బియ్యం ఇవ్వాళా, రేపటికి సరిపోతాయి. చిన్న వత్తిడిఫలితంగా గుడివాడనుండి 300 టన్నులు (అనగా 2700 బస్తాలు) తెప్పించుతామని చెప్పారు. యివైనా వారంరోజులు రావు. తర్వాత?

ప్రభుత్వం వెంటనే కలుగచేసికోవాలి. యీ క్రింది ఏర్పాట్లు తక్షణం చేయాలి. లేకపోతే కృష్ణాజిల్లాలోని బెజవాడలోనే బియ్యం లేక పస్తులుండాల్సి వస్తుంది.

1. క్రొత్తధాన్యం వచ్చేవరకు అనగా మరొకనెలకైనా సరిపోయేధాన్యాన్ని వెంటనే సప్లయి చేయాలి.

2. మొదటిలాగా నాల్గుమిల్లులనే సప్లయికి నియమించాలి.

3. ధాన్యంధర, సంచి, తోలకంలేకుండా 11-0-0 లు నిర్ణయించాలి. ఎవరు కొనినా సకటేధర వుండాలి.

4 బియ్యం పట్టీ నమోదు చేయుటలోను, సప్లయి విషయంలోను, రేషనింగు, పర్చేజింగు శాఖలకు పూర్తి సమన్వయంవుండాలి. తప్పుడు బియ్యం యిచ్చేవారిని, అధికలాభాలకు బియ్యం హోటల్సు వగైరాలకు అమ్మే మిల్లుయజమానులను, తీవ్రంగా శిక్షించాలి.

— టి. వెంకటేశ్వరరావు

సెక్రటరీ, పట్టణ అహారకమిటీ, బెజవాడ.

16-12-44.

8 వ అఖిలభారత విద్యార్థి మహాసభ, కలకత్తా

డిశంబరు 28, 29, 30 తేదీలలో

అధ్యక్షులు: శ్రీమతి సరోజినీదేవిగారు

మహాసభ సందర్భంలో వివిధరాష్ట్రీయుల మధ్య వాగ్వాద పోటీలు - కలకత్తా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల డిబేటు - బెంగాలు, సోవియట్, చైనా, విద్యార్థి చిత్రపట ప్రదర్శనములు - బెంగాలు ప్రజావిజ్ఞాన మండలి, వివిధరాష్ట్రీ విద్యార్థిదళముల వైజ్ఞానిక ప్రదర్శనములుండును.

మహాసభకు ఎన్నుకొనబడిన ప్రతినిధులందరు 25 వ తేదీ ఉదయం కలకత్తా మెయిలుపై బయలుదేరవలయును.

యస్. వి. నరసయ్య,
కార్యదర్శి, ఆంధ్రరాష్ట్రీ విద్యార్థి ఫెడరేషన్

కాశేశ్వరరావుగారికి విద్యార్థి ఫెడరేషన్ జవాబు

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి యస్ వి నరసయ్యగారు యీక్రింది ప్రకటన చేస్తున్నారు:

నెల్లూరుజిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగారికి. విద్యార్థి ఫెడరేషన్ - కాంగ్రెసు సంబంధాలనుగూర్చి వివరిస్తూ, శ్రీ కాశేశ్వరరావుగారు వివిధవర్గాలపై కాంగ్రెసు పలుకుబడి బలహీనపడుతున్నదనీ. అందువల్ల వర్గసంఘాల వారంతా యేకమై ఒకే నాయకత్వం క్రింద కాంగ్రెసుక్రిందకువచ్చి, ఆయా వర్గాల మీద కాంగ్రెసు పలుకుబడిని అభివృద్ధి చేయాలంటూ జాబు వ్రాశారు.

కాని కాశేశ్వరరావుగారు కేవలం పొరపాటు ధోరణిలో పడ్డారు. వర్గసంఘాల ఐక్యత నెలకొల్పాలంటే. కాంగ్రెసువాదులంతా, నేడు పనిచేస్తున్న ప్రజాసంఘాలలోనే పాల్గొనాలి. కాని కాశేశ్వరరావుగారు తమ నాయకత్వం క్రింద ప్రత్యేక విద్యార్థిసంఘాలను నిర్మించ బూనుకొనడం నేడున్న ఐక్యతను విచ్ఛిన్నపర్చడమే అవుతుంది.

విద్యార్థిసంఘాలన్నీ ఒకే జెండాను, ఒకే పార్టీ నాయకత్వాన్ని అనుసరించాలనడం, కాంగ్రెస్ కార్యక్రమాన్ని అనుసరించని వేరువేరు రాజకీయ, మతసంస్థలను వారివారి ప్రత్యేకసంఘాలు పెట్టుకోమని ప్రోత్సహించడమవుతుంది.

వివిధ విద్యార్థిసంఘాల మధ్య ఐక్యత నెలకొల్పడమే కాశేశ్వరరావుగారి ఆశయమైతే, సంయుక్త రాష్ట్రకాంగ్రెసు నాయకులైన శాగ్జీనా, స్వామి సంపూర్ణానంద్‌గార్లు చెప్పిన రీతిగా ఐక్యస్వతంత్ర విద్యార్థిఉద్యమ నిర్మాణానికి కృషిచేయమని విజ్ఞప్తి చేస్తున్నాను. ఆంధ్రరాష్ట్రంలో కూడా యే ఒక్క రాజకీయ పార్టీకి లోబడి యుండని స్వతంత్ర ఐక్య విద్యార్థి ఉద్యమాన్ని నెలకొల్పుటకు కృషిచేయవలసిందనీ, ఉపద్రవకరమైన తమ పంథానుండి విరమించుకోవలెననీ శ్రీ కాశేశ్వరరావుగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

★ యుద్ధసమీక్ష

గ్రీసు నుండి వైదొలగండి!

చర్చిల్ జోక్యాన్ని గర్హిస్తూ బ్రిటన్‌లో తీవ్ర ఆందోళన

హంగరీలో శరవేగంతో సోవియటు సేనలు ముందు ఉరుకుతున్నాయి. గత 20 దినాలలో ఎర్రసేన అనేకవిజయాలను సాధించాయి. హంగరీ రాజధాని బుడాపెస్టుకు దక్షిణంగా మార్షల్ "టోల్బుఖిన్" సాగించిన జైత్రయాత్ర ప్రపంచాన్ని దిగ్భ్రమ గొల్పించింది. యుగోస్లావియా సరిహద్దున ఉన్న డాన్యూబ్‌నదిని దాటి, బాలటాన్ సరస్సు తీరం వరకు అతని సేనలు చేరాయి. ఒక్క వారంలో 100 మైళ్ళ వేగంతో పురోగమించినవంటే, మార్షల్ టోల్బుఖిన్ సామర్థ్యాన్ని వేరే కొనియాడాలా? బుడాపెస్టుతో స్లొవేకియా రాకపోకలను ఇతడు తెగగొట్టాడు. దక్షిణాన్నుంచి ఆస్ట్రియా పైకి ఉరకడానికి సిద్ధపడుతున్నాడు. మరొకప్రక్క బుడాపెస్టుకు ఉత్తరంగా జకోస్లొవేకియాలోకి ఎర్రసేనలు చొచ్చుకుపోతున్నాయి. బుడాపెస్టుకు ఈశాన్యంనుండి దెబ్బగొడుతున్న మార్షల్ మాలినోవిస్కీ, శత్రువులను జకోస్లొవేకియాకు తరుముతున్నాడు. వాళ్ళకి "ముందుపోతే గొయ్యి, వెనక్కిపోతే నుయ్యి" లాగావుంది. ఇటు మాలినోవిస్కీచే తరుమబడుతున్న ఆ జర్మన్లు, తిరాపోయి జక్‌గెరిల్లాల చేతుల్లో పడాలి. బుడాపెస్టుకు, జకోస్లొవేకియాకు రాకపోకలు తెగగొట్టబడుతున్నాయి. మరొక సోవియట్ సేన, ఆస్ట్రియా రాజధాని వియన్నాకు ముఖద్వారం అనదగు బ్రాటిస్లావా కోసం భీషణయుద్ధాలు సాగించుతున్నది. అంటే యిప్పుడు సోవియటుసేనలు బ్రాటిస్లావాకు 85 మైళ్ళలోకి, ఆస్ట్రియా రాజధానికి 100 మైళ్ళలోకి వచ్చాయన్నమాట.

బుడాపెస్టులోని, హిట్లరు క్రింది తొత్తు ప్రభుత్వం, బుడాపెస్టునగరం వదలి పారిపోయింది. బుడాపెస్టు విముక్తి త్వరలోనే సంభవమవుతుంది. ఆస్ట్రియాలోని జర్మను సేనలకు ప్రమాద పరిస్థితి ఎక్కువయింది. హంగరీ విముక్తితోపాటు, ఆస్ట్రియా విముక్తి కూడ త్వరలోనే ఉన్నదనడానికి, మాస్కో రేడియో "ఆస్ట్రియా" జనులకు చేసిన విజ్ఞప్తియే నిదర్శనం. ఆవిజ్ఞప్తిలో "ఎర్రసైన్యం, మిమ్మల్ని విముక్తిచేసే సైన్యం - ఆస్ట్రియా గుమ్మంలోకి వచ్చింది. ఫాసిస్టు రాక్షసత్వంనుండి మీదేశాన్ని విముక్తి గావించుకోడానికి, మీచేతనైన అన్నివిధాలా కృషిచేయండి."

యూరప్‌లో పశ్చిమాన, జర్మనీ సరిహద్దులోకి అక్కడక్కడ మిత్రసైన్యాలు చొరబడటం, జర్మన్ల తిరుగుదాడులూ తప్పితే, చెప్పుకోదగిన విశేషాలేమీలేవు.

దినదినగండం

ఇక ప్రాచ్యరంగంలో చూద్దాం. చైనాలో క్విచౌరాష్ట్రంనుంచి జపానుసేనలు తిరోగమించుతున్నాయి. ఇంతమాత్రానికే సంతోషించరాదు. చైనాపరిస్థితి "దినదిన గండం. నూరేండ్లాయుష్షు" అన్నట్లు వుంది. ఇప్పటికీ శత్రువు చుంకింగ్‌కు 350 మైళ్ళ లోనే ఉన్నాడు. క్వాంగ్సీలోని జపాను సైన్యాలను పూర్తిగా తరిమినప్పుడుగాని ప్రమాద పరిస్థితులు తొలగవు. అందుచే "మాంచెస్టర్ గార్డియన్" లాంటి బ్రిటిషు మితవాదపత్రికల సలహానైనా గమనించి, చంగ్-కై-షేక్ కమ్యూనిస్టు సైన్యాలపై కాపలా తీసివేసి, వారితో ఒడంబడిక చేసుకోవాలి. జపానుపైకి అప్పుడింకా అదనంగా సైన్యాలను పంపే అవకాశం ఉంటుంది.

బర్మాలో మనవాళ్ళు "థామో"ను కైవశం చేసుకొన్నారు. కాని ప్రపంచ దృష్టిఅంతా అటు పశ్చిమరంగంమీదగాని, ఇటు చైనా పైనగాని, ఇప్పుడిప్పుడే స్వల్పవిజయాలు సాధించుతున్న బర్మా, ఫిలిప్పైన్‌ల పైనగాని లేదు. హంగరీలోని అద్భుత విజయాలుకూడ గ్రీసులోని ఘటనలచాటున మరుగుపడిపోతున్నాయి.

గ్రీసులో పరిస్థితి

బ్రిటన్ అమెరికాలలో, చెప్పుకోదగ్గ పత్రిక యేదీ చర్చిల్ చర్యలను సమర్థించలేదు. చర్చిల్ చర్యలను ఖండించుతూ ఈ రెండుప్రదేశాలలో పత్రికలన్నీ ఖండించాయి. గ్రీసులోని ఘటనలపట్ల కార్మికు లెంత ఉద్రిక్తులై ఉన్నారో మొన్న "లేబర్‌పార్టీ" మహాసభలో ద్యోతకమైంది.

పార్లమెంటులో, చర్చిల్ ఉపన్యాసానంతరం లేబర్‌పార్టీ, వోటింగులో పాల్గొనలేదు. దీనికితోడు లేబరుపార్టీ మహాసభలో "గ్రీసులోని పరిస్థితులకు విచారించుతూ" ఒక తీర్మానం తెచ్చింది. తీర్మానం మితవాద ధోరణిలో ఉన్నా, కార్మికపక్షంలోని మితవాద నాయకులు సైతం చర్చిల్‌ను సమర్థించడం లేదని దానివల్ల స్పష్టమౌతోంది. లేబరుపార్టీలో అనుయాయిలు ప్రభుత్వ చర్యలను ఖండించాలని పట్టుబట్టారు. లేబరుపార్టీలోని మితవాద నాయకుల తీర్మానమే చివరకు నెగ్గినా, కార్మిక జనసామాన్యం అంతా ప్రభుత్వ చర్యలను ఖండించుతున్నదనడానికి నిదర్శనం ఆ మహాసభలోని అనేక కార్మిక ప్రతినిధుల ఉపన్యాసాలే. వారు గ్రీసు ప్రతిఘటనా ఉద్యమ నాయకులతో సంధిచేసుకోవాలని కోరారు. సోదర గ్రీసు దేశభక్తులను హత్య చేయడం మానాలన్నారు. "ఫాసిస్టు స్పెయిన్, పోర్చుగల్, టోరీముఠాతప్ప ప్రపంచమంతా గ్రీసుదేశభక్తుల పక్షానే ఉన్నద"ని అన్నారు.

ఇక గ్రీసులోని యుద్ధపరిస్థితి చూద్దాం, బ్రిటిషు సేనలు విమానాలు, టాంకులు ఉపయోగించినా లాభం లేకపోయింది. పపాండ్రియో పలుకుబడి ఎంత ఉందో ఈ దెబ్బతో తేలిపోయింది. దేశభక్తుల తరపునే యావన్మంది గ్రీకు ప్రజలూ నిలిచారు. గనుకనే, బ్రిటిషుసైన్యాలు ఏమీ సాధించలేకపోయాయి. సాలోనికా అంతా ప్రతిఘటనా ఉద్యమ నాయకుల చేతిక్రిందికి వచ్చింది. ఏథెన్సునుండి రేడియోలో చెబుతూ ఒక అమెరికా విలేఖరి 12 వ తేదీన ఇలా అన్నాడు. "పిరయస్ ద్వీపకల్పంలోని కొద్దిభాగం తప్ప తక్కువ గ్రీసు అంతా దేశభక్త సైన్యాల చేతులలోనే ఉంది".

లండన్ "టైమ్సు" పత్రికసైతం, "గ్రీసులోని బ్రిటిషు విధానం అపజయం పొందింది" అని వ్రాసింది. దేశభక్తసైన్యాలను నడపడానికి "మంచి సైనిక నాయకుడు ఉండి ఉండాలి." అంటూ (గ్రీసులోని) టైమ్సు పత్రిక విలేఖరి వ్రాస్తున్నాడు. "న్యూస్ క్రానికల్" రాజకీయ విషయ సంపాదకుడు "కమ్మింగ్స్"కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. గ్రీసు దేశభక్త సైనికుల బలాన్ని చర్చిల్ తక్కువ అంచనా వేశాడని అంటున్నాడు.

ఒకప్రక్క, ప్రతిఘటనా ఉద్యమ నాయకులతో రాయబారాలు సాగించుతూనే, మరొకప్రక్క అదనపు సైన్యాలను పంపుతున్నాడు చర్చిల్. కాని ఈ అదనపు సైన్యాలు కూడా ఏమీ చేయలేవు. సైనికుల హృదయంకూడా ఎటువైపు ఉందో చర్చిల్ గ్రహించాలి. గ్రీసు దేశభక్తులపై భారత సైన్యాల్ని ఉపయోగించడాన్ని గర్హించని భారతీయుడు ఉండడు. సాలోనికాలోని భారతీయ సైన్యాలు, గ్రీసు దేశభక్త సైన్యాలతో చేతులు కలిపాయని ఒకవార్త వచ్చింది. భారతీయ సైన్యాలలోకూడ ఎట్టి గాఢమైన మార్పులు వస్తున్నాయో దానినిబట్టి గ్రహించవచ్చు. భారతీయులెవ్వరూ చర్చిల్ చర్యలను సమర్థించరని ఈ ఒక్క ఘటనే తెలియజేస్తోంది. నిన్న ఆదివారంనాడు లండన్‌లో బ్రహ్మాండమైన సభ జరుగుతుందనీ, చర్చిల్ వైఖరిని ఖండించుతారనీ, అంతకు పూర్వం వార్తలు వచ్చాయి. భారతీయుల తరపున, కమ్యూనిస్టునాయకుడు డాంగే మాట్లాడుతాడు. నేడు ప్రభుత్వంయెడ అసమ్మతి తెలుపుతూ ఒకగంట సమ్మెచేయడానికి బ్రిటిషు కార్మికులు నిశ్చయించుకొన్నట్లు మరొకవార్త వచ్చింది. ఈ ఘటనలన్నీ అభివృద్ధి నిరోధకులైన సామ్రాజ్యవాదులను ఊగించిపారవేయగలవు. చర్చిల్ లొంగకతప్పదు.

— తుమ్మల వెంకటరామయ్య

19—12—44.

ద్వితీయ ఆంధ్రఅభ్యుదయ రచయితల మహాసభ

బెజవాడలో డిశంబరు 29, 30, 31 వ తేదీలలో

అధ్యక్షులు :

శ్రీ తెలికిచర్ల వెంకటరత్నంగారు

(నవ్య సాహిత్య పరిషత్కార్యదర్శి)

ప్రారంభకులు :

సజ్జద్ జహీర్

(అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి.)

చిత్రకళా ప్రదర్శనానికి ప్రతి ప్రాథమికసంఘమూ ప్రత్యేకబాధ్యత తీసికొని, చిత్రాలను 25 వ తేదీకి రాష్ట్రసంఘ కార్యాలయానికి పంపాలి.

ప్రతినిధులందరు 28 వ తేదీ రాత్రికే చేరాలి. యే ప్రాంతంనుంచి యెందరు వచ్చేదీ 26-12-44 వ తేదీకి రాష్ట్రసంఘ కార్యాలయం గవర్నరుపేట, బెజవాడకు తెలియజేయవలయును. స్టేషన్‌వద్ద వలంటీర్లు వుంటారు.

ప్రాథమిక సభ్యులందరూ ప్రతినిధులుగ రావచ్చును. ప్రతినిధిరుసుము రు. 2-0-0 లు. మూడురోజుల భోజనము, వసతి, వుచితము.

ఇట్లు,

పాటిబండ అప్పారావు
(ఆహ్వానసంఘాధ్యక్షులు)

కొమఱ్ఱాజు వినాయకరావు
(ఆహ్వానసంఘ కార్యదర్శి)

(2 వ పేజీ తరువాయి)కృష్ణమూర్తిగారులేచి, తన పేరు తానే సూచించుకొనుచున్నానని నిలబడ్డాడు.

ఎన్నికలలో కృష్ణమూర్తి, (రాయిష్టుల) ముఠా పూర్తిగా ఓడిపోయింది. వారికి 35 ఓట్లుకన్నా హెచ్చురాలేదు. గురుస్వామి అధ్యక్షుడుగాను, శ్రీనివాసులు నాయుడు, అబ్దుల్లాగారలు ఉపాధ్యక్షులుగాను ఎన్నుకోబడ్డారు. కె యల్. నరసింహం ప్రధాన కార్యదర్శిగాను, దేవసుందరం సహాయ ప్రధాన కార్యదర్శిగాను గెలిచాడు.

ముగింపు

గేట్లుతెరిచారు. ప్రతినిధులు బయటకు వస్తున్నారు. వాళ్ళలో వారు సణుగుకున్నారు ప్రతినిధులు. "ప్రభుత్వం వద్ద వీరిముఠా నెలకు 13000/- రూ. పుచ్చుకుంటున్నారు. పైగా సిగ్గులేదు. కాంగ్రెసు - లీగూ ఫాసిస్టు సంస్థలట! యితడిసంగతి ఎవరికితెలియదు! ప్రతిదానికి పేచీ - అడ్డంకులే! పైగా యూనియన్‌నే బద్దలుచేస్తారట" అని కృష్ణమూర్తిని విమర్శిస్తున్నారు.

సభ పూర్తిఅయేసరికి సాయంత్రం 4 గంటలైంది. ప్రతినిధులు ప్రయాణానికి సిద్ధపడ్డారు. ప్రత్యేకపు పెట్టెలలో యూనియన్ జెండాతో, నినాదాలతో తమ ప్రాంతాలకు సాగిపోయారు. ప్రతినిధులంతా తమ యూనియన్‌ను మరింత బలపరుచుకోవాలనే కృతనిశ్చయంతో వెళ్లారు.

ప్రజాశక్తి
★
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్ర కమిటీ పత్రిక
★
సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE